సాక్షి
నిర్మల్
శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. IIలో▸



పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు గోపాలుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. IIIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.5 /24.5

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆపద సమయంలో అప్రమత్తతే ముఖ్యం



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

కుంటాల: ఆపద సమయంలో అప్రమత్తతతో ఉంటేనే ప్రాణాలు కాపాడుకోవచ్చని ఎన్డీఆర్ఎఫ్ టీం కమాండర్ అమర్ ప్రతాప్‌సింగ్ సూచించారు. మండలంలోని పాత వేంకూర్ గ్రామస్తులకు ప్రకృతి వైపరీత్యాలు, తుఫాన్‌లు, వరదలు వచ్చినప్పుడు రక్షణ దళాలు ప్రజలను ఎలా రక్షిస్తారో గురువారం వివరించారు. ఆపద వచ్చినప్పుడు తమకుతాము ఎలా రక్షించుకోవాలో మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో వనజ, ఆర్ఐ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి అరుణ, సిబ్బంది కుల్దీప్ సింగ్, నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న గాల రాజన్న ఇల్లు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుధవారం రాత్రి కుప్పకూలింది. ఈ సమయంలో రోడ్డుపై ఎవరూ.. లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మాజీ కౌన్సిలర్ మేడారం అపర్ణప్రదీప్ గురువారం ఉదయం మున్సిపల్ సిబ్బందిసాయంతో శిథిలాలను తొలగింపజేశారు.

22న మహాగర్జన



మాట్లాడుతున్న సందే కార్తీక్‌మాదిగ

భైంసా: ఈనెల 22న భైంసా పట్టణంలో నిర్వహించే మహా గర్జనను విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాదిగ కోరారు. పట్టణంలోని పిప్రికాలనీలో అన్నాబావుసాఠె కమ్యూనిటీహాల్‌లో గురువారం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మహాగర్జనకు ముఖ్య అతిథిగా వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికుల పింఛన్ పెంచుతామని చెప్పి మోసం చేసిన ప్రభుత్వం పోరాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు బాలేరావు నందకుమార్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, జిల్లా అధ్యక్షుడు అంబేకర్ సాయిచంద్, నాయకులు ఆనంద్, తుకారాం, దిగంబర్ మాదిగ, మహేశ్, గజ్జారాం, మారుతి, గజేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో జాతీయ సమైక్యత



కల్నల్ విక్రమ్‌ప్రతాప్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న హెచ్‌ఎం, ఎన్‌సీసీ అధికారి

నిర్మల్: జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో ఎన్‌సీసీ సహాయపడుతుందని 32వ తెలంగాణ బెటాలియన్ ఆదిలాబాద్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విక్రమ్ ప్రతాప్ సింగ్ అన్నారు. నర్సాపూర్(జి)లోని ప్రభుత్వ పాఠశాలలోని ఎన్‌సీసీ బృందాన్ని గురువారం సందర్శించారు. ఎన్‌సీసీ కేడెట్లకు దిశా నిర్దేశం చేశారు. మాట్లాడుతూ.. ఎన్‌సీసీ దేశ సమైక్యతను, సమగ్రతను పెంచే గొప్ప వ్యవస్థ అన్నారు. చిన్నప్పటి నుంచే దేశ సేవను అలవర్చుకునే గొప్ప అవకాశం కల్పించేది ఎన్‌సీసీ అని తెలిపారు. నేషనల్ కేడెట్ కార్ప్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థుల పరేడ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తం, ఎన్‌సీసీ అధికారి సాయినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18 నుంచి రెండోవిడత శిక్షణ


నిర్మల్‌చైన్‌గేట్: లైసెన్స్ సర్వేయర్ల రెండో విడత శిక్షణ శిబిరం ఈనెల 18 నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా సర్వే అధికారి రాథోడ్ సుదర్శన్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మొత్తం 100 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు దాదాపు 50 రోజుల శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిబిరం ప్రారంభ రోజున అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు సివిల్ సర్జన్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 10:30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు.

అవినీతే సమస్య..!


- అందరికీ దక్కని స్వేచ్ఛ–సమానత్వం
- చట్టసభలు, అధికార యంత్రాంగం నిజాయతీగా పని చేయాలి
- అప్పుడే అందరికీ స్వాతంత్య్ర ఫలాలు
- 78ఏళ్ల స్వాతంత్య్ర భారతంపై ప్రజల మనోగతం
- 'సాక్షి' సర్వేలో వెల్లడి

భారతావని స్వాతంత్య్రం సాధించి 78 వసంతాలు పూర్తి చేసుకుని 79వ సంవత్సరంలోకి ప్రవేశిస్తోంది. స్వతంత్ర భారత్ అనేక రంగాల్లో తనదైన ముద్ర వేస్తూ అభివృద్ధి వైపు దూసుకెళ్తోంది. శాస్త్రసాంకేతిక రంగాల నుంచి అంతరిక్షం వరకు ఎన్నో విజయాలు సాధిస్తోంది. స్వతంత్ర భారతంలో ఇన్నేళ్లలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య, స్వేచ్ఛ–సమానత్వం, నిజాయతీగా పని చేయాల్సిన రంగాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యువత, మహిళలు, పురుషులు 140 మందిని 'సాక్షి' సర్వే చేసింది. ప్రస్తుత సమాజంలో అవినీతి ప్రధాన సమస్యగా మారిందనే అభిప్రాయం వ్యక్తమైంది. అందరికీ స్వేచ్ఛ–సమానత్వం లభించడం లేదని స్పష్టం చేశారు. స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే చట్టసభలు, అధికారయంత్రాంగం మరింత నీతి, నిజాయతీగా పని చేయాలని సమాధానం ఇచ్చారు.

– కాగజ్‌నగర్‌టౌన్/ నిర్మల్‌ఖిల్లా/మంచిర్యాలటౌన్/ఆదిలాబాద్







అంతరాలు లేని భారతం కావాలి

- అందరికీ ఉత్తమవిద్య అందాలి..
- అవినీతి రహితంగా.. సమన్యాయం ఉండేలా..
- చైతన్యవంతమైన.. 'స్వచ్ఛభారతం' కావాలి
- 'సాక్షి' టాక్‌షోలో నేటి యువత అంతరంగం

'ప్రపంచమంతా మనవైపు చూసేలా మన దేశం ఉండాలి. అందుకోసం ముందుగా దేశం లోపల ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలి..' అని డిగ్రీ చదువుతున్న యువత 'వందేళ్ల స్వాతంత్య్ర భారతం(1947–2047)'పై తమ అంతరంగాన్ని వ్యక్తపర్చారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలోని దీక్ష డిగ్రీకళాశాలలో ప్రత్యేక టాక్‌షో నిర్వహించారు. ఇందులో దేశంలో, సమాజంలో రావాల్సిన మార్పులపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అంతరాలు లేని భారతం కావాలని చాలా మంది పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెంగ శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

– నిర్మల్



సాక్షి టాక్‌షోలో మాట్లాడుతున్న విద్యార్థిని, హాజరైన విద్యార్థులు

పెద్దలను గౌరవించేలా..



ఒకప్పటి సమాజం తిరిగి రావాలి. పెద్దలను గౌరవించాలి. అమ్మానాన్న బాగా చూసుకోవాలి. సమాజంలో అందరూ కలిసిమెలిసి ఉండాలి. దేశం కోసం ఐక్యంగా పాటుపడాలి.

– అక్షయ, డేటాసైన్స్

లింగభేదం ఉండొద్దు



సమాజంలో ఇప్పటికీ ఆడ, మగ అనే తేడా ఉంది. దీంతో మహిళలు ఎదగడం లేదు. బాలికావిద్యను ప్రోత్సహించాలి. మహిళలు స్వేచ్ఛగా ఉన్నతవిద్య చదివే అవకాశాలు పెంచాలి. ఉద్యోగం చేసేలా సమాజంలో మార్పు రావాలి. అప్పుడే లింగభేదం తొలగిపోతుంది.

– లవేజా, ఎంపీసీఎస్

'స్వచ్ఛభారత్' ఇంకెప్పుడూ..?



సరిగా చదువుకోనివారు రోడ్లను, వీధులను శుభ్రం చేస్తుంటే, బాగా చదువుకున్నవాళ్లేమో ఇష్టారీతిన చెత్తను పడేస్తున్నారు. పరిసరాల శుభ్రతను కనీసం పట్టించుకోవడం లేదు. ఇకనైనా 'స్వచ్ఛభారతం' కావాలి.

– స్రవంతి, ఎంపీసీఎస్

విద్యావ్యవస్థలో మార్పురావాలి..



మంచి ర్యాంకు వచ్చినా ఇతర అంశాలను చూసి కష్టపడి చదివే వారికి అన్యాయం చేస్తున్నారు. అలాకాకుండా చదువుకున్న వారికి న్యాయం జరిగేలా వ్యవస్థలో మార్పురావాలి.

– వాణి

డ్రగ్స్‌రహిత దేశమవ్వాలి..



దేశ యువతను పీడిస్తున్న డ్రగ్స్, ఓవర్‌స్పీడ్‌లే వారి ప్రాణాలను తీస్తున్నాయి. ప్రతీ అనర్థానికి కారణం అవుతున్న డ్రగ్స్ రహిత దేశమవ్వాలి. యువత తమ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

– అనూష, డేటాసైన్స్

సమన్యాయం ఉండాలి..



సమాజంలో పెద్దవాళ్లకు ఒకన్యాయం, పేదలకు ఒక న్యాయం అన్నట్లుగా ఉంది. పెద్దవాళ్లు రూల్స్ బ్రేక్‌చేస్తున్నారు. ఇలాకాకుండా అందరికీ సమన్యాయం ఉండాలి.

– సుబియా సదాఫ్, బీజెడ్‌సీ

పదిమందికి ఉపయోగపడేలా..



సమాజంలో ఇప్పటికీ చాలామంది డబ్బులతోపాటు తినే ఆహారాన్నీ వేస్ట్ చేస్తున్నారు. ఇలా చేసే బదులు దాన్ని పదిమందికి ఉపయోగపడేలా చూడాలి.

– శ్రీజ, డేటాసైన్స్

అధునాతన విద్య అందాలి..



ఏఐ వంటి అధునాతన అంశాలు అందరికీ అందేలా నాణ్యమైన విద్యను అందించాలి. పేద, ధనిక అంతరం లేకుండా సమవిద్య అందించేలా దేశం మారాలి.

– పవిత్ర, డేటా సైన్స్

అవినీతి రహితమవ్వాలి..



దేశంలో అవినీతిని కూకటివేళ్లతో తొలగించాలి. అవినీతిరహిత దేశమైతేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. కష్టపడి చదివే వారికే ఉద్యోగం అందాలి.

– మునజ్జా

ఇప్పటికీ రోడ్లు, డ్రైనేజీల్లేవు..



ఇప్పటికీ చాలాగ్రామాలకు సరైన రోడ్లు లేవు. చాలావరకు డ్రైనేజీలే లేవు. ఎవరికీ వీటిపై పట్టింపు ఉండటం లేదు. ఇలాంటివన్నీ మారాలి.

– విహారి

ప్రతిభకు పట్టం కట్టాలి..



ఎంత చదువుకున్నా ఏం లాభం లేదన్న బాధ చాలామందిలో ఉంది. పరీక్ష విధానంలో మార్పు తేవడంతోపాటు ప్రతిభకూ పట్టం కట్టేలా వ్యవస్థలో మార్పు తీసుకురావాలి.

– ఇక్రాన్ నాహీన్, బీకాం

బాలికలకూ సమన్యాయం..



సమాజంలో బాలికలపై చిన్నచూపు పోవాలి. 'యూ ఆర్ ఏ గర్ల్' అంటూ బాలికలను పక్కన పెట్టొద్దు. అమ్మాయిలూ బాగా చదువుకునే వాతావరణం కల్పించాలి.

– హఫ్సాసిద్దిఖీ

భావిభారతం బాగుండాలి..



ఇప్పటికీ చిన్నపిల్లలను ఎత్తుకుని చాలామంది భిక్షాటన చేస్తున్నారు. అలాంటి పిల్లల భవిష్యత్తు ఏమవుతుందో తెలియదు. భావిభారతం బాగుండేలా చర్యలు చేపట్టాలి.

– శివాణి

పొలిటికల్ సిస్టం మారాలి..



దేశంలో అందరినీ ఒక్కటిగా చూసే పొలిటికల్ సిస్టం ఉండాలి. కులం, మతం అనే భేదాలు ఉండొద్దు. విద్యావ్యవస్థలోనూ మార్పులు రావాలి.

– కైఫ్‌ఫారూఖీ

ఓల్డేజ్ హోం లేని దేశంగా..



చాలామంది తల్లిదండ్రులను అనాథలుగా రోడ్లపై వదిలేస్తున్నారు. అనాథ, వృద్ధాశ్రమాల్లోనూ ఉంచడం లేదు. అసలు ఓల్డేజ్‌హోం లేని దేశమవ్వాలి. మళ్లీ మంచి కుటుంబవ్యవస్థ రావాలి.

– నేహ, బీఎస్సీ

స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం



వేడుకలకు సిద్ధమైన కలెక్టర్ కార్యాలయం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో 78వ స్వాతంత్య్ర వేడుకలకు కలెక్టరేట్‌లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మరోవైపు వేడుకలను గ్రామగ్రామాన పండుగలా నిర్వహించేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించనున్నారు.

కార్యక్రమ వివరాలు ఇలా:

ఉదయం 9.30 గంటలకు: సిరిసిల్ల రాజయ్య చేతులమీదుగా జాతీయ పతాకావిష్కరణ
09.35: గౌరవ వందన స్వీకారం
09.37: ముఖ్య అతిథి ప్రసంగం
10 నుంచి 10.40 వరకు: సాంస్కృతిక కార్యక్రమాలు
10.40 నుంచి: ప్రశంసాపత్రాలు, బహుమతుల ప్రదానం
11.20 గంటలకు: తేనేటి విందు..

మారిన వేదిక....

ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వేడుకలు నిర్వహించాల్సి ఉండగా వర్షాలు పడుతున్న క్రమంలో అధికారుల ఆదేశాల మేరకు కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

వరద సహాయ చర్యలకు రూ.కోటి నిధులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద సహాయక చర్యలకు ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రతీ జిల్లాకు రూ.కోటి విడుదల చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సచివాలయం నుంచి కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రితోపాటు చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల్లో వర్షాల ప్రభావం, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, వరద ముప్పు, అవసరమైన రక్షణ చర్యలు, సహాయక బృందాల మోహరింపు, కంట్రోల్ రూంల ఏర్పాటు వంటి అంశాలపై సూచనలు చేశారు. సహాయక చర్యల పర్యవేక్షించేందుకు ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

ముందస్తు చర్యలు చేపట్టాం..

అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ భారీ వర్షాలతో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కడెం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో స్థితిని ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, నీటి మట్టం పెరిగిన సందర్భంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాల వారీగా తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 15 నుంచి 21 వరకు బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితులు, తక్షణ సహాయం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం 24 గంటలు పనిచేసేలా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు 9100577132 నంబర్‌కు సమాచారాన్ని అందించవచ్చన్నారు. ఎస్పీ జానకీషర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

- ఎస్పీ జానకీషర్మిల



టీషర్టులు అందుకున్న సైబర్ వారియర్స్‌తో ఎస్పీ

నిర్మల్ టౌన్: జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు పెట్టినట్లు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు చెందిన 'సైబర్ వారియర్స్' కు గురువారం ప్రత్యేక టీషర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న సైబర్ నేరాలపై ఫిర్యాదు అందిన వెంటనే స్పందిస్తున్నట్లు తెలిపారు. సైబర్ వారియర్స్ ఫిర్యాదులను జాగ్రత్తగా పరిశీలించి, సాక్ష్యాలను సేకరించి, వాటిని జిల్లా సైబర్ సెక్యూరిటీ విభాగానికి అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేశ్‌మీనా, సైబర్‌క్రైం సీఐ ఎల్‌వీ.రమణ, అన్ని పోలీస్ స్టేషన్ల సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం

బాసర: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) బాసరలో ఫాదర్ ఆఫ్ లైబ్రేరియన్‌షిప్‌గా ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ 133వ జయంతి పురస్కరించుకుని జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ లైబ్రరీ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్ హాజరయ్యారు. ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో సమాచారం పొందే మార్గాలు బహుముఖంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ, గ్రంథాలయాల ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదన్నారు. పుస్తకాల విలువ శాశ్వతంగా నిలిచి ఉంటుందని తెలిపారు. విశ్వవిద్యాలయ డిజిటల్ లైబ్రరీ సౌకర్యాలను విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు విస్తృతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. లైబ్రరీ అధికారి డాక్టర్ కె.అరుణజ్యోతి మాట్లాడుతూ, పుస్తక పఠనం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పుస్తకాలు కేవలం విజ్ఞాన సముపార్జనకు మూలం మాత్రమే కాక, మనలో ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయన్నారు. భాషా నైపుణ్యాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. సృజనాత్మకతను అభివృద్ధి చేస్తాయని పేర్కొన్నారు. డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ లైబ్రేరియన్‌షిప్ రంగంలో చేసిన అమూల్యమైన కృషిని స్మరించారు. కార్యక్రమంలో సిబ్బంది అర్చన, శైలజ, ఓరియంటేషన్ కోఆర్డినేటర్, లైబ్రరీ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పుస్తక ప్రదర్శనను అతిథులు తిలకించారు.



నివాళులర్పిస్తున్న వీసీ గోవర్ధన్, అధికారులు

క్లుప్తంగా

డయల్ 100 దుర్వినియోగం చేసిన ఒకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: డయల్ 100కు పలుమార్లు కాల్ చేసి పోలీసుల విలువైన సమయాన్ని వృథా చేసిన ఒకరిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక బంగల్‌పేట్ మహాలక్ష్మి వాడకు చెందిన సిలీకే నరేందర్ అవసరం లేకున్నా పలుమార్లు 100కు డయల్ చేసి విధుల్లో ఉన్న పోలీసుల సమయాన్ని వృథా చేయడంతో పాటు, ఇతర కాల్స్‌కు అంతరాయం కలిగించాడన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు బెల్లంపల్లిలో ఉమ్మడి జిల్లా మహాసభ

బెల్లంపల్లి: తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ (టీహెచ్‌డబ్ల్యూ) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభను శుక్రవారం బెల్లంపల్లిలోని అగర్వాల్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గెల్లి రాజలింగు తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. 21 విభాగాల్లో పని చేస్తున్న హమాలీలు పాల్గొంటారని, సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ తయారు చేయనున్నట్లు తెలిపారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ



సీసీ ఫుటేజీలో గుర్తు తెలియని వ్యక్తి

లోకేశ్వరం: గుర్తు తెలియని వ్యక్తి ఓ మహిళకు మాయమాటలు చెప్పి మెడలో ఉన్న బంగారు గొలుసు అపహరించిన ఘటన గురువారం మధ్యాహ్నం మండలంలోని వాస్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వాస్తాపూర్ గ్రామానికి చెందిన మేకల యమునాబాయి తనకున్న రెండు ఎద్దులను మేపేందుకు గ్రామ శివారులోని అబ్దుల్లాపూర్‌కు వెళ్లే రోడ్డు మార్గంలోకి వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమెకు మాయమాటలు చెప్పి తన మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. గమనించిన గ్రామస్తులు అతన్ని వెంబడించగా నిజామాబాద్ వైపు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితునికోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముల్కల్ల గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కోటపల్లి మండలం దేవులవాడకు చెందిన నిట్టూరి శశిపాల్ (36) గురువారం ఉదయం ముల్కల్ల శివారులో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 కు సమాచారం అందించడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని తండ్రి లస్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి దూరం.. చారిగాం

అదో మారుమూల కుగ్రామం. ఆ గ్రామంలో అందరి జీవనాధారం వ్యవసాయమే. ప్రతీరోజు ఉదయాన్నే నిద్రలేచి ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. మహాత్మాగాంధీ సూచనలు నమ్మిన కాగజ్‌నగర్ మండలంలోని చారిగాం గ్రామస్తులు మద్యపాన నిషేధాన్ని పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



- మూడున్నర దశాబ్దాల క్రితం పెద్దల తీర్మానం
- ఇప్పటికీ కట్టుబాటు పాటిస్తున్న గ్రామం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో చారిగాం గ్రామం ఉంది. ఈ గ్రామంలో 234 మంది జనాభా, 112 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారంతా మద్యపాన నిషేధానికి కట్టుబడి ఉంటున్నారు. గ్రామంలో గుడుంబా తయారీ, బెల్టుషాపుల ఏర్పాటు చేయవద్దని మూడున్నర దశాబ్దాల క్రితమే పెద్దలు తీర్మాణించారు. ఇప్పటికీ అవే ఆచారాలను పాటిస్తున్నారు. గ్రామంలో అన్నీ వ్యవసాయ కుటుంబాలే. ప్రధానంగా కూరగాయాలు సాగుచేసి పట్టణంలోని మార్కెట్‌లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. 35 ఏళ్లుగా గ్రామస్తులు మద్యపాన నిషేధం పాటిస్తున్నారు. స్థానిక యువత బయట తాగినట్లు తెలిస్తే ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకెళ్లి వారిచే మాలధారణ చేయిస్తున్నారు. మరోసారి మద్యం జోలికి వెళ్లకుండా వారికి అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉంటారు. ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా మంచి నడవడికతో ఉంటున్నారు.

ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది



మా తాతల కాలం నుంచి గ్రామంలో ఎవరూ మద్యం సేవించరు. అదే ఆచారం ఇప్పటి వరకూ కొనసాగుతోంది. గ్రామంలో అందరం కలిసి మెలిసి ఉంటాం. ఏ సమస్య వచ్చినా ఇక్కడే అందరం కలిసి పరిష్కరించుకుంటాం. ఆంజనేయ స్వామి గుడిలో పూజలు నిర్వహిస్తాం. అందరం కలిసి పండుగలు ఆనందంగా జరుపుకుంటాం.

– మొర్ల పోచయ్య, చారిగాం

స్నేహభావంతో ఉంటాం



గ్రామంలోని యువకులమంతా కలిసి మెలిసి స్నేహభావంతో ఉంటాం. గ్రామంలో ఏమైనా సమస్య ఉంటే యువకులమంతా ఒకేచోట చేరి పరిష్కరించుకుంటాం. గ్రామంలో ఎవరూ మద్యం సేవించరు. బెల్టుషాపులు పెట్టరు. ఇదే ఆచారాన్ని అందరం పాటిస్తాం.

– మొర్ల శంకర్, చారిగాం

స్వచ్ఛతలో మేటి 'దేవునిగూడ'



దేవునిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం

- రెండుసార్లు ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక
- కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

జన్నారం: దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, గ్రామాలు పచ్చదనంతో ఉంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని చెబుతారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతే ధ్యేయంగా ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా పరిశుభ్రం, పచ్చదనంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంలో ముందుండడమే కాకుండా ఉత్తమ గ్రామ పంచాయతీగా రెండుసార్లు ఎంపికై ంది. సర్పంచ్, కార్యదర్శులు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అదే జన్నారం మండలంలోని దేవునిగూడ.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

దేవునిగూడ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గుర్రం శిరీష, కార్యదర్శి సరిత ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటుగా హరితహారం, పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు. డ్రెయినేజీలు శుభ్రం చేయించడం, మురుగు నీరు రోడ్లపై పారకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచారు. పలుమార్లు ఈ గ్రామాన్ని సందర్శించిన ఉన్నతాధికారులు పంచాయతీ పాలకవర్గం పనితీరుపై ప్రశంసలు కురిపించారు. ఇందులో భాగంగా 2022 ఆగస్టు 15న అప్పటి సర్పంచ్ శిరీష, కార్యదర్శి సరిత కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలి




కడెం ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల,అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

- కలెక్టర్ అభిలాష అభినవ్
- కడెం ప్రాజెక్టు సందర్శన

కడెం: భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. కడెం ప్రాజెక్టును ఎస్పీ జానకీషర్మిలతో కలిసి గురువారం సందర్శించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన మేరకు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదలాలన్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం, ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు, ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న నీరు, దిగువకు వదులుతున్న నీటి వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని గేట్లను ఎత్తాల్సిన పరిస్థితి వస్తే దిగువన ఉన్న అన్ని గ్రామాలను అప్రమత్తం చేయాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో భారీ వర్షాలపై చాటింపు చేసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు సమీపంలోకి ప్రజలను, చేపలు పట్టే వారిని, రైతులను, పశుకాపరులను, సందర్శకులను, అనుమతించవద్దని తెలిపారు. ప్రాజెక్టు పరీవాహక ప్రాంతాలలో అలుగులు పారే ప్రదేశాలలో పోలీసు సిబ్బంది గస్తీ కాయాలని అన్నారు. అనంతరం ప్రాజెక్టు పవర్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన స్కాడా సిస్టం స్క్రీన్‌లో ప్రాజెక్టుపై అమర్చిన కెమెరాల ద్వారా ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా గమనించారు. వారివెంట ఏఎస్పీ రాజేశ్‌మీనా, అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, తహసీల్దార్ ప్రభాకర్, డీఎఫ్‌వో నాగిని భాను, ఎస్ఈ వెంకటరాజేంద్ర ప్రసాద్, ఈఈ విఠల్, డీఈఈలు నవీన్, వీరన్న, కె.గణేశ్ తదితరులు ఉన్నారు.

కడెంకు తగ్గిన వరద



ప్రాజెక్ట్ గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం: కడెం ప్రాజెక్టుకు గురువారం తెల్లవారుజాము నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. రాత్రి 3,457క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఒక వరద గేటు ద్వారా 3,930 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 694.750 అడుగుల వద్ద నిలకడగా ఉండేలా చూస్తున్నామని పేర్కొన్నారు.

మత్తు ఇంజక్షన్ ఇచ్చి పశువుల చోరీ

- అక్రమంగా రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల



నిందితులను చూపెడుతున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లాలో కొంతకాలంగా పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన సయ్యద్ సోహెల్ దాదాపు 40 మందితో టీమ్ తయారు చేసి గ్యారేజ్ ఏర్పాటు చేశాడు. అతనితో పాటు మహారాష్ట్రకు చెందిన షేక్ జమీర్, షేక్ ముర్తుజా, మహమ్మద్ నసీర్, సయ్యద్ అక్రమ్, షోయబ్, ఫైజాన్, రాజు, భైంసాకు చెందిన షేక్ ఉమెర్, ఖలీద్, తాయూబ్ ముఠాగా ఏర్పడ్డారు. వీరికి సోహెల్ నాయకత్వం వహించాడు. వారంతా జిల్లాలో పశువులకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి చోరీ చేసి మాంసాన్ని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో విక్రయించేవారు. వారికి ఖలీద్ మత్తు ఇంజక్షన్లు సప్లై చేసేవాడు. ఇటీవల ఈ ముఠా పశువులను చోరీ చేసేందుకు వాహనంలో ముధోల్‌కు రాగా సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకునేందుకు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఏడుగురు రెండు కార్లలో రాజస్థాన్ పరారయ్యారు. విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా వద్ద ఉన్నట్లు గుర్తించి అక్కడి పోలీసుల సహాయంతో వారిని నిర్మల్ తీసుకొచ్చారు. వారితో పాటు షేక్ ఉమెర్, ఖలీద్‌ను భైంసాలో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, 8 ఫోన్లు, రూ.39,280 నగదును స్వాధీనం చేసుకున్నారు. నాందేడ్‌కు చెందిన రాజు, భైంసాకు చెందిన తయూబ్ పరారీలో ఉన్నారు. మిగతా వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ వెల్లడించారు. కేసును ఛేదించడంతో చాకచక్యంగా వ్యవహరించిన భైంసా ఏఎస్పీ అవినాష్, నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా, ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, భైంసా రూరల్ సీఐ నైలు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సొసైటీ పాలకవర్గాల గడువు పొడిగింపు

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

కైలాస్‌నగర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్)ల పాలకవర్గాల గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. గురువారంతో వీటి కాల పరిమితి ముగియగా మరో ఆరు నెలల పాటు సొసైటీ, డీసీసీబీ చైర్మన్ల పదవీకాలం పొడిగిస్తూ రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సొసైటీ చైర్మన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ అడ్డి భోజారెడ్డి గురువారం సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎంను సన్మానిస్తున్న అడ్డి భోజారెడ్డి

అక్రమంగా తరలిస్తున్న యూరియా పట్టివేత



పట్టుబడిన వాహనంతో సీఐ, ఏవో, ఎస్సై

కోటపల్లి: బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న యూరియాను గురువారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బన్సీలాల్ వివరాలు వెల్లడించారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా బొలెరోలో ఎలాంటి ఆధారాలు లేకుండా మహారాష్ట్రకు తరలిస్తున్న 62 బస్తాల యూరియా పట్టుబడడంతో వ్యవసాయాధికారి సాయికృష్ణారెడ్డికి సమాచారం అందించామన్నారు. అతను వచ్చి యూరియాను పరిశీలించి అక్రమంగా తరలిస్తున్నారని చెప్పడంతో వాహనాన్ని కోటపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. చెన్నూర్ పట్టణంలోని అస్నాద్ రోడ్డులో గల శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఫెర్టిలైజర్ షాపు నుంచి యూరియా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి వాహన డ్రైవర్‌పై రాజమల్లు, షాపు యజమాని బాపురెడ్డిపై ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1983 చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్జీయూకేటీలో ముగిసిన ఓరియంటేషన్

బాసర: ఆర్జీయూకేటీ బాసరలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమం గురువారం విజయవంతంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ గోవర్ధన్, ప్రత్యేక అతిథిగా ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధరన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సానుకూల ఆలోచన పెంపొందించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను తార్కిక ఆలోచన, సరైన నిర్ణయాలతో అధిగమించగల సామర్థ్యం ప్రతీ విద్యార్థిలో ఉందన్నారు. మీరు ఈ స్థాయికి రావడానికి చేసిన కృషి, నిబద్ధత భవిష్యత్‌లో కూడా మీ విజయాలకు దారితీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేటెడ్ డీన్ డాక్టర్ విఠల్, డాక్టర్ మహేష్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాజేశ్‌రెడ్డి, గజ్జెల శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది, నూతన విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఇళ్లపై త్రివర్ణ పతాకం ఆవిష్కరించాలి

చెన్నూర్: ప్రతి ఒక్కరూ ఇళ్లపై త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. హర్ ఘర్ తిరంగలో భాగంగా గురువారం చెన్నూర్ పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ నుంచి ప్రధాన వీధుల్లో జాతీయ పతాకాలతో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బత్తుల సమ్మయ్య, కేవీఎం శ్రీనివాస్, తిరంగా ర్యాలీ కన్వీనర్ శివకృష్ణ, మంత్రి రామయ్య పాల్గొన్నారు.

నిర్మల్‌కు చేరిన రాజీవ్ సద్భావన యాత్ర



రాజీవ్ జ్యోతి సద్భావన బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతి యాత్ర గురువారం నిర్మల్‌కు చేరుకుంది. కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప నేత రాజీవ్‌గాంధీ అని అన్నారు. రాజీవ్ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. దేశం సంఘటితం కోసం కృషి చేశారని కొనియాడారు

అధిక తేమ పంటలకు చేటు



కోటపల్లి మండలంలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

- తక్షణమే జాగ్రత్తలు పాటిస్తే మేలు
- బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్

చెన్నూర్‌రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పంటచేలల్లో నీరు నిలిచింది. నీరు ఎక్కువైతే తేమ ఏర్పడి పంటలకు నష్టం వాటిల్లనుంది. అధిక తేమతో పంటలు నష్టపోకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెన్నూర్ ఏడీఏ బానోతు ప్రసాద్ సూచిస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే...

వర్షాలకు పత్తి చేనులో నీరు నిలిస్తే వెంటనే కాలువలు తీసి నీటిని బయటకు పంపించాలి. వర్షాలు తగ్గిన వెంటనే భూమిలో తేమను తగ్గించు కోవడానికి అంతర సేద్యం చేయాలి. బురద పదనులో ఎకరాకు 25 కిలోల యూరియా 10 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి. అలాగే ఎకరానికి సీఓసీ 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఒకరోజు తర్వాత కిలో స్వర్ణపాల్‌ను 150 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. పంటను వేరుకుళ్లు తెగులు ఆశిస్తే 3 గ్రాముల ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో తడపాలి.

మొక్కజొన్న

అధిక తేమను తట్టుకోలేదు. సాధ్యమైనంత త్వరగా అంతరకృషి చేసుకోవాలి. ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును మొక్కల మొదళ్ల దగ్గర వేసుకోవాలి. కాండం తొలిచే పురుగు ఉంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 3 కిలోలు ఆకు సుడుల్లో వేయాలి. పెసర, మినుము పైర్లకు అధిక తేమతో పేనుబంక, లద్దె పురుగు ఆశించే అవకాశం ఉంది. ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మిరప పంట

మిరప చేనులో నీరు నిలిస్తే వెంటనే నీటిని కాలువల ద్వారా తొలగించాలి. నారుకుళ్లు తెగులు ఆశిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా రెండు గ్రాముల రిడోమిల్ లీటరు నీటికి కలిపి వారంలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే అధిక తేమ నుంచి పంటలను కాపాడుకోవచ్చు.